






# వావ్.. వాటే ఫ్యామిలీ: ఒక ఇల్లు.. ముగ్గురు సర్పంచ్ లు

పవర్ ఫుల్ హౌస్ అన్న మాట అప్పుడప్పుడు వింటుంటాం. ఈ ఇంటి గురించి తెలిస్తే.. అసలుసిసలు పవర్ ఉన్న హౌస్ గా అర్థమవుతుంది. ఒకే ఇంట్లో ముగ్గురు సర్పంచ్ లు ఉండే ఆ ఇల్లు మిగిలిన చాలా ఇళ్లతో పోలిస్తే సోస్పెషల్ గా చెప్పాలి. నర్సంపేట మండల పరిధిలో ఉండే ఈ ఇల్లు ఇస్పెషల్ అని చెప్పక తప్పదు. నర్సంపేట మండలంలోని రాజేపేట గ్రామ పంచాయితీ 1970లలో ఏర్పడింది. ఏజెన్సీ గ్రామమైన రాజుపేటకు ఇప్పటివరకు ఎనిమిదిసార్లు పంచాయితీ ఎన్నికలుజరిగితే.. ఇందులో ఒకే ఇంటి నుంచి ముగ్గురు సర్పంచులు పని చేయటం విశేషం. తల్లి.. కొడుకు.. కోడలు సర్పంచ్ లుగా వ్యవహరించారు. 2001లో కోడలు బానోతు కోమటి సర్పంచ్ గా ఎన్నికై 2006 వరకు పని చేశారు. ఆమె అత్త బానోతు మల్లమ్మ 2006 నుంచి 2011 వరకు సర్పంచ్ గా వ్యవహరించారు. 2019లో కొడుకు బానోతు దస్రు సర్పంచ్ గా గెలిచి.. 2024 వరకు వ్యవహరించారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గ్రామ సర్పంచ గా వ్యవహరించిన తీరు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో వీరి గురించి మాట్లాడుకునేలా చేస్తుందని చెప్పాలి. తెలంగాణలో జరుగుతున్న పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో పలు ఆసక్తికర అంశాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా సర్పంచ్ గా పోటీ చేసేందుకు వీలుగా నెలకు రూ.32 వేల వరకు జీతం వచ్చే ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ ఎన్నికల బరిలోకి దిగటం ఆసక్తికర అంశంగా చెప్పాలి. తెలంగాణ సాంస్కృతిక శాఖ సారథి కళాకారుడిగా పని చేస్తున్న బరిగెల బాబు సర్పంచ్ గా పోటీ చేయాలని డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగా కాంట్రాక్టు పద్ధతిలో చేస్తున్న ఉద్యోగానికి రిజైన్ చేశారు. ఈ మేరకు తెలంగాణ సాంస్కృతి శాఖ కమిషనర్ కు తన రాజీనామా లేఖ రాశారు. ఆయన గ్రామం సర్పంచ్ గా ఎస్సీ రిజర్వు కావటంతో.. ఆయన పోటీలోకి దిగాలని డిసైడ్ అయ్యారు. ఇదిలా ఉండగా.. బాబు రాజీనామాకు కమిషనర్ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. మరి.. ఎన్నికల పోరులో ఎలాంటి ఫలితాన్ని నమోదు చేస్తారో చూడాలి.

# 2025 టూ 2050 : మనిషిని మింగేసే యుగంలోకి



కాలం మారుతుంది అన్నది అందరికీ తెలిందే. కానీ మార్పు కూడా ఎవరూ ఊహించని వేగం అందుకోవడమే నవీన తరం మ్యాజిక్. 2000లోకి ప్రపంచం అడుగు పెట్టిన వేళ కొత్త సహస్రాబ్ది అని అంతా వేడుక చేసుకున్నారు. కానీ 2000 నంబర్ చాలా బరువుగా ఉండడంతో పాటు భవిష్యత్తు ఇంకా దూకుడుగా ఉంటుందని అంచనా వరకూ అయితే వచ్చారు. కానీ అది ఎలా ఉంటుందో సరిగ్గా ఎవరికీ తెలిసింది కాదు. అప్పటికి అంతా నెమ్మదిగా ఉండేది. ట్రెడిషనల్ నీడను వీడని టెక్నాలజీతో మెల్లగా సావాసం చేస్తున్న సంధి కాలం అది.

**పావు శతాబ్దం అలా :** ఇక చూస్తూండగానే పావు శతాబ్దం అలా గడిచిపోయింది. అప్పట్లో న్యూస్ పేపర్ ఇంటికి వస్తే చదివేవారు, సినిమా థియేటర్లకు వెళ్ళి చూసేవారు. మార్కెట్ కి వెళ్ళి నిత్యావసరాలు తెచ్చుకునేవారు, జేబులో గాంధీ బొమ్మతో కరెన్సీ నోట్లు కరకరలాడేవి. టీవీలు ఇంకా పూర్తిగా మెదళ్ళను దొలిచేయని కాలం అది. కానీ చూస్తూండగానే పాతికేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. ఆనాటికీ నేటికీ ఎంతో తేడా. ఒక విధంగా ఈ పాతికేళ్ళూ మనిషి సాంకేతికను మోస్తూ తాను పరుగులు పెట్టాడు అని చెప్పాలి.

**అనూహ్యంగా అంతా :** ఈ పాతికేళ్ళలో మార్పు ఏంటి అంటే సినిమా ఇంట్లో కాదు చేతిలో చూడడం, అలాగే చేతిలో డబ్బు ప్రమేయం లేకుండానే డిజిటల్ పేమెంట్స్ చేయడం, న్యూస్ పేపర్ లేనిదే కాలకృత్యాలు తీరని వారు ఇపుడు మొబైల్ ఫోన్లలో వార్తలు చదవడం అందులోనే చానళ్ళలో చూడడం అలవాటు చేసుకున్నారు. ఒకనాడు ఇంటర్నెట్ కేఫ్ లు ఉండేవి. వాటి నుంచే నెమ్మదిగా పనిచే దాంతో మెయిల్స్ పంపించుకుంటే టెక్నాలజీలో పదడుగులు వేసిన ఫీలింగ్. కానీ ఇపుడు మొత్తం ఇంటర్నెట్ అన్నీ శాసిస్తోంది. హాయిగా ఇంట్లో కూర్చోని జాబ్స్ చేస్తారు అని ఎవరనుకున్నారు. ప్రపంచం అంతా ఒక చిన్న స్మార్ట్ ఫోన్ లో బంధీ అవుతుందని కూడా ఎవరూ అసలు ఊహించలేదు. అలా 4జీ, 5జీ, కాదు 6జీ కూడా వచ్చేస్తోంది.

**బూచాడమ్మా బూచాడు కాస్తా :** పాత సినిమాలో బూచాడు అంటే కదలక మెదలక ఉండే నల్లని కలర్ లోని ల్యాండ్ లైన్ ఫోన్. అదే 2000 దాకా అంతా చూశారు, వాడారు, అపుడే మొబైల్స్ టెక్నాలజీ మెల్లగా అడుగుపెట్టింది. మొదట్లో తీగలతో కాకుండా చేతిలో ఫోన్ పట్టుకుని ఎక్కడికి అయినా వెళ్ళి చేసుకునే వెసులుబాటు గ్రేట్ అని అనుకున్నారు. కానీ ఇపుడు స్మార్ట్ ఫోన్ చూస్తూండగానే విశ్వరూపం చూపించి ప్రతిదీ మింగే పరికరంగా మారిపోయింది. కెమెరా, వాచ్, రేడియో, నోట్‌బుక్, నిఘంటువు, మ్యాప్, కాలిక్యులేటర్, మ్యూజిక్ సిస్టమ్ ఇలా ఒకటి రెండూ కాదు సమస్తం స్మార్ట్ ఫోన్ మింగేసి అంతా తానై కూర్చుంది. అంతే కాదు ఫోటో తీసుకోవాలంటే ఎంతో ప్రయాస కానీ ఇపుడు చూస్తే ఫోన్ కెమెరాలు రోజువారీ జీవితాన్ని పూర్తి నిడివి డాక్యుమెంట్ చేయడం అలవాటుగా మార్చాయి. ఇక అన్నింటికీ మించి సోషల్ మీడియా ఆలోచనలను వ్యక్తీకరించడానికి బలమైన వేదికగా మారిపోయింది.

**వాట్సప్ ఫ్యామిలీస్ :** ఎదురు బొదురూ లేని బతుకులు ఈ పాతికేళ్ళలో అయిపోయాయి. బంధాలు అన్నీ మటాష్ అయ్యాయి. ఒకే ఇంట్లో ఉన్నా అందరికీ ఫోన్లు ఎవరి వ్యాపకాలు వారికి ఉన్నాయి. అయితే ఇంత దాంట్లోనూ వాట్సాప్ కుటుంబ కనెక్షన్‌ల పేరుతో తిరిగి కలవడం ఒక ఊరట. అంతే కాదు, వీడియో కాల్స్ ఎంతెంతో దూరాలను తగ్గించేశాయి. అమెరికా టూ అనకాపల్లి హాయిగా చూస్తూ మాట్లాడుకునే రోజులు వచ్చాయి. ఈ రోజున స్మార్ట్‌ఫోన్ లేకుండా పని చేయడం చాలా కష్టంగా మారింది. అవతల వారితో కమ్యూనికేట్ చేయడం దాదాపు అసాధ్యంగా మారింది.

**డిజిటల్ పేమెంట్స్ తో :** ఈ రోజున ఫోన్ ఉంటే చాలు ప్రపంచాన్ని కొనేయవచ్చు. ఒక అతి చిన్న ఆహార దుకాణాల నుండి మాల్స్ వరకూ ఫోనే డిజిటల్ పేమెంట్స్ చేస్తుంది. దాంతో బ్యాంకులకు వెళ్ళే శ్రమ తప్పింది. అదే సమయంలో ఆర్థిక పారదర్శకత పెరిగింది. ఇక సోషల్ మీడియా ద్వారా కంటెంట్ ఎవరి దగ్గర ఉంటే వారు పదిమందికీ తెలియచేసే చాన్స్ దొరికింది. అలా ఫోటోలు, వీడియోలు, కళ, సమీక్షలు సోషల్ మీడియా ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రపంచాన్ని చేరుకోవడానికి ఒక వేదికను ఇచ్చింది అని చెప్పాలి. దీని వల్ల సరికొత్త రచయితలు పుట్టారు, అలాగే, నూతన చిత్ర నిర్మాతలు పుట్టుకొచ్చారు, చిన్న వ్యాపారాలు పెరిగాయి, అంతదాకా ఎందుకు ఆఖరుకు రాజకీయాలు కూడా సోషల్ మీడియా ట్రెండ్‌లను అనుసరించడం ప్రారంభించాయి అంటే ఈ పాతికేళ్ళ టెక్నాలజీని చెప్పతరమా.

**వినోదం రూపు మారింది :** సినిమా అంటే ఒకనాడు థియేటర్లకు వెళ్ళాల్సి వచ్చేది. కానీ ఇపుడు స్మార్ట్ ఫోన్ లోనే ఉంది అది. అలాగే గత దశాబ్దంలో, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు ఇలా చెప్పుకుంటే ప్రతిదీ మారిపోయింది. అంతే కాదు గ్లోబల్ కథలతో రచయితలు ఆకట్టుకుంటున్నారు ప్రపంచ సినిమా అయింది, వెబ్ సిరీస్ డాక్యుమెంటరీలకు వినోద రంగం ఎగబాకింది. టాలెంట్ కి కొత్త మార్గాలు దొరికాయి. ఇక 2000లో పుట్టిన పిల్లలు బాల్యం అంతా టెక్నాలజీతోనే గడించింది. వారికి బాల్యం పుస్తకాల కంటే మొబైల్ స్క్రీన్‌లతోనే అని చెప్పాల్సి.

**తర్వాత పాతికేళ్ళూ ఎట్లా :** సహస్రాబ్దిలో తొలి వందలో పాతికేళ్ళు ఇట్టే ముగిసాయి. ఇక అంతా ఆలోచిస్తోంది ఏంటి అంటే తరువాత పాతికేళ్ళూ ఎట్లా ఉంటుంది అని. ఇపుడు కృత్రిమ మేధ ఏఐ రూపంలో ముంగిటకు వచ్చేసింది. ఒక విధంగా ఏఐ యుగం ప్రారంభమైనట్లే అని చెప్పాలి. దాంతో దాంతో రాబోయే పాతికేళ్ళూ కృత్రిమ మేధస్సుకు చెందినవి అని అర్థం అయిపోతోంది. ఇప్పటిదాకా అంతా చూసింది కేవలం చిన్నపాటి కదలికలే. అసలైన కుదుపులూ టెక్నాలజీ పరంగా విప్లవాత్మకమైన మార్పులు అన్నీ ఈ పాతికేళ్ళలోనే ఉంటాయని మేధావులు అంటున్నారు. టోటల్ చేంజ్ అన్నది ఇపుడే స్టార్ట్ అవుతుంది అని అంచనా వేస్తున్నారు.

**జాబ్స్ ఉంటాయా లేదా :** ఏఐ ఆవిష్కరణ తరువాత అందరిలోనూ మెదిలే పెద్ద ప్రశ్న ఏమిటి అంటే జాబ్స్ ఉంటాయా లేదా అన్నది. దీనికి వెంటనే జవాబు ఉంది. ఉన్న జాబ్స్ ఊడతాయి. అంటే 2025 నాటికి ఉన్న ట్రెడిషనల్ జాబ్స్ ఇక కనిపించవు అన్న మాట. అలా ఉద్యోగాలు మారుతాయి, అలాగే నైపుణ్యాలు మారుతాయి. ఏఐ నిర్దాక్షిణ్యంగా పాత ఉద్యోగాలను తొలగిస్తుంది ఇది సత్యం. కానీ కొత్త వాటిని కూడా సృష్టిస్తుంది. ఇది నిజం. ఇక వచ్చే భారీ మార్పులు ఏంటి అని చూస్తే కనుక మనిషిలోని వ్యాధులను ముందుగానే గుర్తించే రోగనిర్ధారణ వ్యవస్థలు అద్భుతంగా వెలుగు చూస్తాయి అంతే కాదు వ్యక్తిగత వైద్య ప్రొఫైల్‌ల ఆధారంగా చికిత్సలు కూడా ఉంటాయి. ఇంటి నుండి వర్చువల్ వైద్యులు రోగికి ట్రీట్మెంట్ ఇస్తారు.

**అన్నీ ఊహించని మార్పులే :** అంతే కాదు ఏఐ సాధనాలతో తిరిగి రూపొందించబడిన విద్యా విధానం అమలులోకి వస్తుంది. అలాగే ఇంటి పనులు వంట పనులు ఆఫీసు పనులు ఇలా అన్నీ చక్కబెట్టే మానవ యంత్ర సహకారాలు అభివృద్ధి చెందుతాయి. అంతే కాదు, కళలు, సంగీతం, సినిమా, రచన – ప్రతిదీ ఏఐతోనే. అంతటి గొప్ప క్రియేటర్ గా ఏఐ ఉంటుంది అన్న మాట. ఒక్క మాటలో చెప్పాలి అంటే గత 25 సంవత్సరాలు గొప్పగా ఉంటే రాబోయే సంవత్సరాలు విప్లవాత్మకంగా ఉంటాయి అంటున్నారు. 2000 నుండి 2025 వరకూ మార్పులు అన్నీ మనిషి తానుగా క్రియేట్ చేసి ఆవిష్కరించినవిగా ఉన్నాయి. కానీ ఇక మీదట మనిషి పాత్ర పరిమితం అయి ఏఐ వంటి టెక్నాలజీలు అన్నింటా అగ్రభాగాన నిలుస్తాయి అన్న మాట.

**మనిషి ఎక్కడ ఉంటాడో :** ఇలా చెప్పుకుంటూ పోతే రానున్న పాతికేళ్ళలో మనిషి ఎక్కడ ఉంటాడు అన్నదే ధర్మ సందేహం. ఇక మీదట మానవులు సృష్టించిన యంత్రాలు అన్నీ మార్గనిర్దేశం చేస్తాయి. అయితే ఇది భయానకంగా ఉంటుందా లేక మంచి అవకాశాలకు వేదిక అన్నది ఇపుడే ఎవరూ చెప్పలేరు ఏఐని మనిషి ఉపయోగించే తీరుని బట్టే అది ఆధారపడి ఉంటుంది అని మాత్రం చెప్పగలరు. గత పాతికేళ్ళలో ఊస్తే మానవ జీవితం అంతా డిజిటల్ ప్రపంచంలోకి వెళ్ళింది. కానీ రానున్న పాతికేళ్ళలో మానవాళిని మెరుగైన మేధస్సు యుగంలోకి తోసివేసే టెక్నాలజీ వస్తుంది. అయితే మార్పులు అన్నవి అనివార్యం. వద్దన్నా వస్తాయి. కానీ వాటిని అర్థం చేసుకోవడం, మనిషికి తగినట్లుగా మానవ వికాసానికి అనుగుణంగా రూపించుకోవడంలోనే అందం ఉంది. పరమార్థమూ ఉంది.

# మోస్ట్ వాంటెడ్.. ఆర్థిక నేరస్తుల 'బర్త్ డే' పార్టీ.. కేంద్రానికి సెగ!

వారిద్దరూ పలు బ్యాంకులను మోసం చేశారు. వందల కోట్ల రూపాయల ధనాన్ని ఎగవేశారు. ఎంచక్కా.. దేశం విడిచి వెళ్లిపోయారు. పైగా.. తరచుగా కవ్విస్తున్నారు కూడా. వీరిపై దేశంలో అనేక కేసులు కూడా నమోదయ్యాయి. వారే.. ఒకరు కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ అధిపతి విజయ్ మాల్యా, మరొకరు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మాజీ ఛైర్మన్ లలిత్ మోడీ. వీరిద్దరూ.. భారత్‌కు మోస్ట్ వాంటెడ్. నేరస్తుల జాబితాలో వీరిద్దరూ ఉన్నారు. వీరిని భారత్‌కు తీసుకువచ్చే ప్రయత్నాలు కొన్నాళ్లుగా సాగుతున్నా అవి ఫలించడం లేదు. వారి గొంతెమ్మ కోరికలు అలా ఉన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో జైళ్లను తయారు చేయాలని.. తమకు అందించే వైద్య, ఆహారం ప్రపంచ స్థాయిలో ఉండాలని.. స్థానిక కోర్టుల్లో సదరు ఆర్థిక నేరస్తులు .. పిటిషన్లు వేశారు. వీటిపై విచారణ కొనసాగుతూ నే ఉంది. ఇదిలావుంటే.. తాజాగా ఈఇద్దరు నేరస్తులు కలిసి.. భారీ ఎత్తున బర్త్ డే పార్టీ చేసుకున్నారు. పుట్టినరోజు ఒక్కరిదే అయినా.. భాగస్వామ్యం మాత్రం ఇద్దరిదీ. లలిత్ మోడీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన సతీమణి ఇచ్చిన భారీ విందు పార్టీకి విజయ్ మాల్యా కూడా





హాజరయ్యారు. ప్రస్తుతం వీరిద్దరూ లండన్‌లోనే సురక్షితంగా ఉన్నారు. ఈ క్రమంలో లండన్‌లోని మేఫెయిర్‌లో ఉన్న ఖరీదైన మ్యాడాక్స్ క్లబ్‌లో మోడీ సతీమణి రీమా భారీ విందు ఇచ్చారు. అత్యంత తక్కువ మంది సన్నిహితుల మధ్యే ఈ పార్టీ జరిగినా.. దీనికి సంబంధం చిన విజువల్స్, ఫొటోలు లీకయ్యాయి. ఈ వ్యవహారం కాస్తా రాజకీయంగా చర్చకు వచ్చింది. ఇంత జరుగుతున్నా.. మోడీ సర్కారు వారిని తీసుకురాలేక పోయిందని కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేశారు. లండన్‌లో వారు ఖుషీగా ఉన్నారు. పార్టీలు కూడా చేసుకుంటున్నారు. కానీ, మోడీ మాత్రం వారి వంక కన్నెత్తి చూడరు. పన్నెత్తి పలకరించరు. అని కాంగ్రెస్ ఎంపీలు వ్యాఖ్యానించారు.

**ఇవీ..మోసాలు!...** విజయ్ మాల్యా, లలిత్ మోడీలు భారీ ఆర్థిక మోసాలకు పాల్పడ్డారు. మనీ లాండరింగ్, ఫెమా ఉల్లంఘనల కేసుల్లో లలిత్ మోడీపై కేసులు నమోదయ్యాయి. వేల కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని ఈడీ ఆరోపించింది. ఈయన 2010లోనే దేశాన్ని వీడి వెళ్లిపోయారు. ప్రస్తుతం లండన్‌లో ఉంటున్నారు. ఇక, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధిపతి, వ్యాపార వేత్త.. విజయ్ మాల్యా ఎస్ బీఐ సహా పలు ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలు తీసుకుని ఎగవేశారన్న కేసులు వెంటాడుతున్నాయి. దీంతో వీరిద్దరినీ కేంద్ర ప్రభుత్వం 2020లోనే ఆర్థిక నేరస్తుల జాబితాలో చేర్చింది.

# ఐబొమ్మ రవికి మించిన ముదుర్లు అతడి ఫ్రెండ్స్?


సంచలనంగా మారిన ఐబొమ్మ రవి ఉదంతానికి సంబంధించి పోలీసులు రెండు దఫాలుగా నిర్వహించిన విచారణలోని కొన్ని అంశాలు తాజాగా వెలుగు చూశాయి. పోలీసులకు ముప్పతిప్పలు పెట్టి.. చివరకు దొరికిపోయిన ఐబొమ్మ రవి సంగతి తెలిసిందే. తాను ఎట్టి పరిస్థితుల్లో పోలీసులకు చిక్కనన్న ధీమాతో అతడి అత్యుత్సాహం అతడ్ని పట్టించిందని చెబుతున్నారు. ఐబొమ్మ రవికి తగ్గట్లే.. అతడికి అన్ని విధాలుగా సాయం చేస్తూ.. అండగా నిలిచిన అతని ఇద్దరు ఫ్రెండ్స్ మహా ముదుర్లుగా చెబుతున్నారు. ఐబొమ్మ రవిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అనంతరం అతడికి అత్యంత సన్నిహితులైన ప్రసాద్.. ప్రహ్లాద్ కుమార్ లను గుర్తించే పనిలో పోలీసులు పడ్డారు. అయినప్పటికి వారి ఆచూకీ ఇప్పటివరకు లభించని పరిస్థితి. పోలీసులు ఎంతలా ట్రాక్ చేసినా.. వారి ఆచూకీ మాత్రం ఇంకా లభించలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. పోలీసుల విచారణలో వెల్లడించిన కొన్ని అంవాలకు సంబంధించి ఐబొమ్మ రవి ఇచ్చిన స్పష్టతకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగు చూస్తున్నాయి. అమీర్ పేటలో కంప్యూటర్ కోర్సులు చేసే రోజుల్లోనే రవి తన ఐడెంటిటీని రహస్యంగా ఉంచేవాడని చెబుతున్నారు. ఐదారు నెలలకు ఒకసారి






హాస్టల్ మారేవాడని గుర్తించారు. 2020లో ప్రహ్లాద్ కుమార్.. ప్రసాద్ ను స్నేహితులుగా పేర్కొంటూ సప్లయిస్ ఇండియా.. హాస్పిటల్స్ డాట్ ఇన్ పేరుతో రెండు కంపెనీలు షురూ చేశారు. వీరి వివరాలతోనే ఆధార్.. పాన్ కార్డులు.. డిజైన్ సంతకాలు రూపొందించారు. దాదాపు 35కు పైనే డొమైన్లు నిర్వహిస్తున్నారు. ఐబొమ్మ.. బప్పం టీవీ వెబ్ సైట్లను ప్రారంభించిన తర్వాత తాను ఎవరన్న విషయం బయటకు రాకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకున్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. ఫ్రెండ్స్ ఐడెంటిటీతో డొమైన్లు కొనుగోలు చేసి.. అందుకు తగ్గట్లే బ్యాంక్ లావాదేవీల్ని నిర్వహించారు. తాను సంపాదించిన డబ్బుపై ప్రతి నెలా రూ.2 లక్షల వరకు రవికి ఆదాయం వచ్చేదని.. ఆ డబ్బులతో తరచూ విదేశాలకు వెళ్లి వచ్చేవాడన్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. రవికి అండగా నిలిచిన ఇద్దరు స్నేహితుల్ని అదుపులోకి తీసుకునేందుకు ఎంతలా పరయత్నిస్తున్నా.. వారి ఆచూకీ మాత్రం దొరకపోవటం చూస్తే.. ఐబొమ్మ రవికి మించిన ముదురుకేసులుగా పోలీసులు భావిస్తున్నారు.

# GOAT ఇండియా టూర్ 2025' నిర్వహణ వెనుకున్నదెవరు?





కొన్ని ప్రత్యేక ఈవెంట్లు మొదట్లో అంత ప్రాధాన్యమైనవిగా కనిపించవు. సదరు ఈవెంట్ కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ దాని స్థాయి ఇట్టే మారిపోవటమే కాదు.. అందరూ మాట్లాడుకునేలా చేస్తోంది. డిసెంబరు 13న హైదరాబాద్ మహానగరానికి దిగ్గజ ఫుట్ బాల్ క్రీడాకారుడు మెస్సీ వస్తున్న సంగతి తెలిసిందే. మొదట్లో ఈ ఈవెంట్ ను హైదరాబాద్ కు తీసుకురావటం.. ఒక ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడించటం.. ఆ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ ముఖ్యఅతిధిగా హాజరు కావటం లాంటివి షెడ్యూల్ అయ్యాయి. అనూహ్యంగా ఈ ఈవెంట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ తీసుకున్నచొరవతో ఇప్పుడు ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ రూపురేఖలే మారిపోయిన పరిస్థితి. మెస్సీతో జరిగే మ్యాచ్ కోసం రాత్రిళ్లు సీరియస్ ప్రాక్టీస్ చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ తీరు చూస్తే.. ఈ మ్యాచ్ విషయంలో ఆయన ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నది అర్థమయ్యేలా చేస్తోంది. GOAT ఇండియా టూర్ 2025 లో భాగంగా కోల్ కతా.. ముంబయి.. ఢిల్లీతో పాటు హైదరాబాద్ లో నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ పుణ్యమా అని.. ఇప్పుడీ కార్యక్రమం మిగిలిన నగరాలతో పోలిస్తే.. తెలంగాణలో ప్రత్యేకమైన ఆకర్షణగా మారింది. ఇంతకూ ఈ భారీ ఈవెంట్ ను నిర్వహిస్తున్నదెవరు? అందులో కీలక భూమిక పోషిస్తున్న వ్యక్తి ఎవరు? అతడి బ్యాక్ గ్రౌండ్ ఏంటి? అన్న వివరాల్లోకి వెళ్లినప్పుడు ఆశ్చర్యకరమైన.. ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. GOAT ఇండియా టూర్ 2025లో భాగంగా మెస్సీ వెళ్లాల్సిన నగరాల్లో హైదరాబాద్ లేదు. కేరళలో జరగాల్సిన మ్యాచ్ రద్దు కావటంతో హైదరాబాద్ జాబితాలో చేరటం.. అదిప్పుడు అగ్రస్థానంలో నిలవటం గమనార్హం. ఈ ఈవెంట్ ను నిర్వహిస్తున్నది ప్రైవేటు సంస్థ ఇంకేదో కాదు..ఇటీవల ప్రాచుర్యంలోకి వచ్చిన 'డిస్ట్రిక్' అనే స్పోర్ట్స్ టెక్ సంస్థ. దీనికి వ్యవస్థాపకుడు కం సీఈవోగా వ్యవహరిస్తున్న శతద్రు దత్తాకు చెందిన సంస్థనే ఈ ఈవెంట్ ను నిర్వహిస్తున్నారు. సామాన్యులకు సినిమా టికెట్లను..ఈవెంట్ల టికెట్లు బుక్ చేసుకోవటానికి ఉపయోగించే యాప్ గా చెప్పొచ్చు. అయితే శతద్రు దత్తా తన పేరుతోనే "A Satadru Dutta Initiative" అనే పేరుతో మరో సంస్థను నిర్వహిస్తున్నారు. క్రీడా ప్రమోటర్ అయిన ఆయన.. ఈవెంట్ ఆర్గనైజర్ గా మంచి పేరుంది. గతంలో ఆయన తన సంస్థ తరపున బ్రెజిల్ దిగ్గజ ఫుట్ బాల్ ప్రముఖులు రొనాల్డిన్హోను.. అర్జెంటీనాకు చెందిన ప్రముఖ గోల్ కీపర్ ఎమిలియానో మార్టినెజ్ ను భారత పర్యటనకు తీసుకొచ్చి.. ఆయా ఈవెంట్లను విజయవంతంగా పూర్తి చేశారు. ఆ ఈవెంట్లు సక్సెస్ కావటంలో హెచ్ఎస్ బీసీ ఇండియా.. జేఎస్ డబ్ల్యూ గ్రూపు.. దాల్మియా సిమెంట్ వంటి ప్రముఖ భారతీయ సంస్థలు స్పాన్సర్ లుగా వ్యవహరించారు. తాజాగా నిర్వహించే కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ సంస్థను రంగంలోకి దింపి.. ప్రభుత్వం కీలక భూమిక పోషిస్తోంది. ఈ ఈవెంట్ కు అమ్ముడయ్యే టికెట్ల ఆదాయాన్ని సదరు సంస్థ ఖాతాలోకే వెళతాయి. శతద్రు దత్తా బ్యాక్ గ్రౌండ్ లోకి వెళితే.. థర్టీస్ లో ఉన్న ఈ యువ వ్యాపారవేత్తకు స్పోర్ట్స్ ఈవెంట్ మేనేజర్ కం ప్రమోటర్ గా మంచి పేరుంది. ఇతని వ్యక్తిగత వివరాలు బయటకురాకుండా జాగ్రత్తలు తీసుకోవటం శతద్రు దత్తా స్పెషల్ గా చెప్పాలి. అంతర్జాతీయ క్రీడాకారులతో సంప్రదింపులు జరిపి.. ఒప్పందాలు కుదుర్చుకోవటంలో అతడి టాలెంట్ వేరే లెవల్ గా చెబుతారు. క్రీడా ప్రతినిధులతో బలమైన నెట్ వర్కు ఆయన సొంతంగా చెబుతారు. గతంలో రొనాల్డిన్హో, ఎమిలియానో మార్టినెజ్ వంటి ప్రముఖ క్రీడాకారులతో నిర్వహించిన ఈవెంట్లు సక్సెస్ కావటంతో తన క్రెడిబులిటీని పెంచుకున్న ఆయన.. తన సంస్థకు సంబంధించిన వివరాలు బయటకు రాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవటం కనిపిస్తుంది. దిగ్గజ ఆటగాళ్లతో డీల్ అంటే కోట్లాది రూపాయిలు అవసరం. అయితే.. తన వ్యాపార లావాదేవీలపై పెద్దగా మాట్లాడుకోకుండా ఉండేలా చేయటం.. తాను నిర్వహించే ఈవెంట్ మాత్రమే ఎక్కువ ఫోకస్ అయ్యేలా చేసే టాలెంట్ శతద్రు సొంతంగా చెప్పాలి. పొలిటికల్ గా ఏ రాజకీయ పార్టీతో ప్రత్యేకంగా అనుబంధం ఉందన్న భావన కలగకుండా చేసుకోవటంలో నేర్పుగా వ్యవహరిస్తుంటారు. తాను ఈవెంట్ ప్లాన్ చేసిన రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవటం.. కార్యక్రమాన్ని సక్సెస్ ఫుల్ గా పూర్తి చేసే విషయంలో ఆయన ప్రదర్శించే దూకుడు.. చురుకుదనం ఇస్పెషల్ గా చెప్పాలి. ఇంత చేసినా.. తాను పెద్దగా ఫోకస్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటం శతద్రు దత్తా విలక్షణతగా చెప్పాలి.

